# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పచ్చగా...

"రండి రండి.. మీరు పుష్ప కదూ!!నేనే మిషెల్, మీరు నాతోనే ఫోన్ లో మాట్లాడారు." అంది కౌంటర్ లో కూర్చున్న ఆవిడ. డెంటిస్ట్ ఆఫీస్ లో పనుండి వచ్చిన నాతో.

తెల్లగా సన్నగా ఉంది. నల్లటి ఉంగరాల జుట్టు. వెనక్కి దువ్వుకుని క్లిప్ పెట్టుకుంది. జీన్స్, పైన తెల్లటి టాప్ వేసుకుంది. చెవులకి తెల్లరాళ్ళున్న దుద్దులు, చాలా తేలికపాటి మేకప్.. ప్రశాంతంగా ఉంది ఆమెని చూస్తే.

“అరే, భలే కరక్ట్ గా చెప్పారు నా పేరు.. అందరూ ‘పుష్ పా అని విడదీసి పలుకుతారు’! “ అన్నాను నవ్వుతూ..

" అలాగా! నాకు చాలా నచ్చింది మీ పేరు, అర్థం’ ఫ్లవర్ ‘అని కదా!" అంది ఆవిడ.

" మీకు అర్థం కూడా తెలుసే?" అన్నాను ఆశ్చర్యంతో..

" అవును.. తెలుసు" అందావిడ చిన్నగా.

ఒక్క క్షణం చిన్నబోయిన ముఖం లోకి నవ్వు తెచ్చుకుని

" డాక్టర్ రావడానికి టైముంది, మనం ఈ లోపల మీ ట్రీట్మెంట్ కి ప్రిపరేషన్ చేద్దాం" అంటూ లోపలకి దారితీసింది.

నాలుగైదు గదులున్న క్లినిక్ అది. రిసెప్షన్ వెనకౌన్న రూములో తీసుకుని వెళ్ళి అక్కడున్న కుర్చీలో కూర్చోబెట్టింది నన్ను.

పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుని నా వివరాలు రాసుకోవడం మొదలు పెట్టింది.

స్వతహాగా కలుపుగోలు మనుషి అనుకుంటా! నవ్వుతూ సరదాగా కబుర్లు చెప్తోంది.

పొద్దున్నించీ ముసురేసి కుర్రుస్తున్న జల్లు మంచుగా మారింది.

" స్నో పడుతోంది" అన్నాను నేను కిటికీలోంచి బయటకు చూస్తూ..

" ఇన్నేళ్ళుగా ఇక్కడే ఉన్నా నాకు స్నో అంటే భలే ఇష్టం. కిటికీకి అతుక్కుపోయి చేతిలో టీ కప్పుతో పడే మంచుని చూస్తూ గంటలు గడిపేయగలను. “చూడండి బయట ఎంత అందంగా ఉందో, సన్నటి తెల్లటిపూలు పడుతునున్నట్టుగా లేదూ!!" అంది చిన్నపిల్లలా..

" అవును” అన్నానుఆమె వైపే చూస్తూ.

" టీ తాగుతారా? కాఫీనా?" అంది నావైపు చూస్తూ..

" టీ, ఏ ఫ్లేవరైనా పరవాలేదు , అన్నాను" కొద్దిగా మొహమాటంగానే..

" బయట మంచు ఉధృతి పెరుగుతోంది, బాగా పెరిగితే డాక్టర్ రావ్డం కష్టమవుతుందేమో!' అనుకున్నాను.

రెండు కప్పులతో వచ్చింది మిషెల్. వేడిగా ఉన్న గ్రీన్ టీ ని కొద్ది కొద్దిగా తాగుతున్నాము.

అప్పటికే నావివరాలన్నీ రాసేసుకుంది, నా పళ్ళని ఒకసారి చూసి డాక్టర్ సూచనల ప్రకారం ఎక్స్ రే తీసి సిద్ధంగా ఉంచింది..ఇంక తాను చేసే పనులేమీ లేవు..

ఇద్దరూ కబుర్లలో పడ్డాము..

మాటల్లో తనకిద్దరు పిల్లలని, పాపకి పదహారు, బాబుకి తొమ్మిదేళ్ళని, తన భర్త స్వంత వ్యాపారం చేస్తారని చెప్పింది.

" ఇండియాలో మీదెక్కడ? ఢిల్లీ, హైదరాబాద్?" అంది హఠాతుగా..

చెప్పాను.. " మీకు ఇండియా బాగా తెలుసుననుకుంటానే! అన్నాను ఆసక్తిగా..

తెలుసు, తెలుసు, నేనొకసారి వెళ్ళానుకూడా అంది.. ఆ విషయం చెప్తున్నప్పుడు ఆమె కళ్ళల్లో చిన్న మెరుపు..

" అవునా? ఎక్కడకి? ఆఫీస్ పని మీదా?" అడిగాను..

" కాదు, పర్సనల్..అప్పుడు నాకు ఇండియన్ బాయ్ ఫ్రెండ్ ఉండేవాడు.అతనితో కలిసి వెళ్ళాను. దోస్ వర్ ద డేస్!” అంది మిషెల్ కళ్ళు మూసుకుని తెరుస్తూ..

" అవునా? మరి?" అనవసరమని తెలిసినా ఆసక్తిని చంపుకోలేక అడిగేశాను.

చిన్నగా నవ్వింది మిషెల్..

“సారీ, అనుకోకుండా అడిగేశాను. మీకిష్టం లేకపోతే చెప్పద్దు!” అన్నాను వెంటనే..

" పర్వాలేదు.. ఇది ఈ రోజు పొద్దున్నించీ వెంటాడుతోంది నన్ను, మర్చిపోయాను అనుకున్నాను కానీ లేదని చెప్తూనే ఉంది.ఆలోచన లేని పిచ్చి మనసు.ఎవరికో ఒకరికి చెప్తేనే కాదు తీరదు.. పొద్దున్నించీ హాంట్ చేస్తోంది నన్ను పచ్చ లెహెంగా” అంది చిన్నగా .

“సారీ, లెహెంగా నా? సరిగ్గా విన్నానా?" అని అడిగాను త్వరగా..

" అవును.. సురేన్ వాళ్ళ అమ్మ ఇచ్చినది అది.. అప్పటినించీ దాని మడతల్లోనే దాచేసుకున్న జ్ఞాపకాలు అవి. ఈ రోజు మా పాప అనుకోకుండా తీసుకి వేసుకుంటానంది. దాంతో మళ్ళీ అన్నీ పైకి వచ్చాయి.."

“సురేన్, అదే సురేంద్రది పంజాబ్ లోని పల్లెటూరుట. వాళ్ళకి అక్కడే పెద్ద వ్యాపారం, దాన్ని అమెరికాలో కూడా విస్తరించాలని సురేన్ నాన్న గారు, ఆయన బాబాయ్ కలిసి అమెరికా వచ్చారు. అప్పటికి సురేన్ పుట్టలేదుట, మొదట్లో కుంటుతూ నడిచిన వాళ్ళ వ్యాపారం సురేన్ పుట్టిన తర్వాతే పుంజుకుని విజయాలబాట పట్టింది. అసలే ఇద్దరు అమ్మాయిల తర్వాత పుట్టిన అబ్బాయనే అతనికి ఇంట్లో ఎంతో గారాబం, కుటుంబానికి అదృష్టం తెచ్చిన వాడన్నది అదనంగా వచ్చి చేరేసరికి అది మరింత పెరిగింది.దాంతో అతనాడింది ఆట, పాడింది పాట అన్న చందాన పెరిగాడుట.

ఆ విషయం నాకు మా పరిచయమయిన కొత్తల్లో తెలిసినా బావుండేది.” అంది మోగుతున్న ఫోన్ ను చేతిలోకి తీసుకుంటూ..

అవతల డాక్టర్ పాపం అనేక క్షమాపణలు చెప్తున్నారు, ‘మంచు పెరిగి రావడం కష్టమవుతోంది అని, అయినా తప్పకుండా వీలైనంత త్వరలో వస్తానని’ చెప్పారు. ఒక్క క్షణం నాతో కూడా మాట్లాడి క్షమాపణలు చెప్పారు..

మంచువల్లనే అనుకుంటా, ఎవరూ కొత్త పేషెంట్లు రాలేదు.

“సారీ బోర్ కొట్టిస్తున్నాను, నాకు తెలుసు.. కానీ మీరు కూడా ఇప్పుడు ఇక్కడ బందీ అయిపోయి నాకు దొరికి పోయారు. “అంది నవ్వుతూ..

ఇద్దరూ చెరో కప్పు టీ మళ్ళీ తెచ్చుకుని రిసెప్షన్ లో సోఫాలో కూర్చున్నాం..

“సురేన్ గురించి చెప్పండి మరి” అన్నాను..

“సురేన్ నేను చాలా చిత్రంగా కలిసాము..ఇలాగే స్నోలోనే!” .. అంది..

' ఓహో, అందుకేనా స్నో అంటే అంత ఇష్టం!" అన్నాను చిలిపిగా...

" కానీ సురేన్, నేను విడిపోయాము కదా.. అది కూడా స్నోపడిన రోజే.. అందుకే ఇష్టమేమో!" అంది మిషెల్..

" అంటే?" నాకర్ధం కాలేదు అన్నాను నేను..

“చెప్తాను.. సురేన్ చాలా అందగాడు. నేను నా స్నేహితులతో కలిసి వెర్మాంట్ లో ఒక రిజార్ట్ కి వెళ్ళాను. అక్కడ స్కీయింగ్ చేసినప్పుడు కలిసాం మొదటిసారి..

చెయ్యడం వచ్చినట్టే అనిపించేసరికి కాస్త వేగంగా వెళ్ళడానికి ప్రయతించాను.. కొంతవరకూ బానే వెళ్ళాను, ఆపైన ఏం జరిగిందో తెలిసేలోపలే సర్రున జారి పడ్డాను.

విపరీతమైన చలి, మొదలైన మంచు వర్షం..

లేచి నిలబడడానికి ప్రయత్నిస్తున్నాను, పడుతున్నాను..

ఏం జరుగుతోందో తెలియలేదం లేదు నాకు. ఇంతలో ఓ చెయ్యి వచ్చి, నా చేతిని గట్టిగా పట్టుకుంది. మెల్లగా ఆ సపోర్ట్ తో లేచి నిలబడగలిగాను..

" థాంక్ యూ" అన్నాను నెమ్మదిగా..

" అవన్నీ తర్వాత. ముందు నీడలోకి వెళదాం. మంచు పడడం మొదలయింది" అన్నాడు అతను గబ గబా అడుగులు వేస్తూ..

గభాల్న జారి పడ్డానేమో నా కాలు కదలనంది..

మంచులో కూరుకున్న కాలుని కూడదీసుకుని నా స్కీయింగ్ గేర్ తీసుకుని అడుగులు వేశాను.. కాళ్ళు కలుక్కుమంటున్నాయి ప్రతీ అడుక్కీ..

అతను వెనక్కి తిరగకుండా నడుస్తున్నాడు.. ఆ స్కీయింగ్ రింక్ పక్కనే ఉన్న పెద్ద చెక్క కేబిన్ లోకి వెళ్ళాము. అతనికి నాలుగు నిమిషాలు పడితే నాకు ఎనిమిది నిమిషాలు పట్టింది.. లోపలకి వెళ్ళాకా పరిచయం చేసుకున్నాం.

అతనికి మరో సారి’ థాంక్స్’ చెప్పాను. అలా మొదలైంది మా పరిచయం..

సురేన్ చాలా అందగాడు, మంచివాడు డబ్బుంది అని ముందే చెప్పాను కదా.. అప్పుడే టీనేజ్ దాటుతున్న నాకు ప్రేమలో పడడానికి అవి చాలు కదా.. అతనిచ్చే ఆకర్షణీయమైన బహుమతులూ, నన్ను ఎంతో ప్రత్యేకంగా చూసే పద్ధతి నాకెంతో నచ్చేవి.

అతను నాలో ఏం చూశాడో నాకిప్పటికీ తెలీదు.. దాదాపు మూడేళ్ళు సాగింది మా ప్రణయం, ప్రయాణం..

ఈ క్రమంలో నాకు కొన్ని అర్థం అవడం మొదలుపెట్టాయి..

దగ్గరగా చూస్తే కానీ కనిపించని కొన్ని విషయాలు కనిపించడం మొదలు పెట్టాయి.. అన్నింటికంటే ముఖ్యమైనది తనకంటూ ఏ పనీ లేకపోవడం అనేది నన్నెంతో బాధించేది..

నాలుగైదు కార్లు సురేన్ అధీనంలో ఉండేవి..

ఎంత ఖర్చు పెట్టేవాడో తనకే తెలీదు నిజంగా.. ఎప్పుడూ ఏ పనీ చేస్తున్నట్టుగా ఉండేవాడు కాదు.. ' నువ్వేం చేస్తావ్?' అంటే బిజినెస్ అనేవాడు ఒక్కో సారి. 'మరో సారి ' ఆర్ యూ కిడింగ్ మీ.. అసలేదైనా చెయ్యాల్సిన అవసరం నాకేమిటి? ఎంత వ్యాపార సామ్రాజ్యానికి వారసుడినో నీకు తెలీదా?" అనేవాడు..

అది నా పద్ధతికి వ్యతిరేకం...

ఎంత చిన్నదైనా మనదంటూ ఒక ఉద్యోగం ఉండాలి, అప్పుడే బాధ్యత తెలుస్తుంది అని నా అభిప్రాయం.. అది నా మధ్యతరగతి మనస్తత్వం వల్ల వచ్చినది కావచ్చు, లేదా నా స్వభావం కావచ్చు.. నాకే తెలీదు.. కానీ అతనదే మాట అంటే నాకు బాధగా ఉండేది..

అది మా మధ్య చిన్న చిన్న గొడవలు రావడానికి కారణమయింది..

దానికి తోడు నేను వాళ్ళింటికి మొదటిసారి వెళ్ళినప్పుడు సురేన్ వాళ్ళ అమ్మ చెప్పిన విషయాలు కూడా అవే అయి , ఆవిడ కి సురేన్ విషయం లో అదే బెంగ అని చెప్పగానే నాకు ఆశ్చర్యం వేసింది.

'నువ్వు నాకెంతో నచ్చావు మిషెల్.. మా వాడి దుడుకు స్వభావానికి నీలాంటి అమ్మాయి సరిగ్గా సరిపోతుంది అనిపిస్తోంది నాకు. వాడు మంచివాడే కానీ వాడికి తెలీనిదల్లా బాధ్యత. ఇంట్లో గారాబం, లెక్క లేనంత డబ్బు, చెయ్యడానికి తగిన పని లేకపోవడం.. ఇవే వాడిని పాడుచేస్తున్నాయి.

వాళ్ళ నాన్న, నాయనమ్మ, తాతగార్లే కారణం.. ఎప్పుడూ శ్రద్ధగా చదివింది లేదు, దేన్నీ సీరియస్ గా తీసుకున్నది లేదు.. డబ్బు ఖర్చు పెట్టడం పట్ల నాకేమీ సమస్య లేదు, సంపాదించడం తెలిసినప్పుడు మాత్రమే ఖర్చుపెట్టడమే న్యాయం అని నా అభిప్రాయం.' అని ఎంతో స్పష్టం గా ఆవిడ చెప్పడం నాకు చాలా నచ్చింది.

ఆ తర్వాత సురేన్ చిన్నక్క పెళ్ళికి మేమందరం ఇండియా వెళ్ళాము. అదే నేను చెప్పిన ఇండియా ట్రిప్. అప్పుడు సురేన్ వాళ్ళ అమ్మ నాకు మంచి ముత్యాల గొలుసు, గోల్డెన్ యెల్లో రంగు లెహెంగా ప్రత్యేకంగా కుట్టించి ఇచ్చారు. అది వేసుకుని వాళ్ళ చిన్నక్క పెళ్ళి వేడుకల్లో ఎంతో హాయిగా పాల్గొన్నాను. అక్కడనించీ అందరం తాజ్ మహల్ చూడడానికి వెళ్ళాము, ఆ తర్వాత వాళ్ళ అమ్మగారి స్వంత ఊర్లో ఉన్న సురేన్ వాళ్ళ అమ్మమ్మగారిని కలిశాము..

అదే ఆఖరు..

ఇండియా నించి వచ్చాకా నేనూ,సురేన్ విడిపోయాము.". అంది మిషెల్.. తెల్లని ఆమె ముఖం చిన్నబోయి ఎర్రబడింది...

"అవునా? అయ్యో! ఏం జరిగింది?" అన్నాను

" కారణం చెప్పాను కదా! అదే!!" అంది మిషెల్ స్థిరంగా..

" అతనేపనీ చెయ్యడం లేదని వద్దనుకున్నారా? వ్యాపారాలు అవీ ఉన్నాయన్నారు కదా!" అన్నాను..

నవ్వింది మిషెల్..

" నిజమే, అదే మాట అతనెప్పుడూ అనేవాడు.. "

"వ్యాపారాలు ఉన్నాయి, అవి ఎలా నడపాలో తెలుసా? కనీసం తెలుసుకునే ప్రయత్నం చేశావా?" అని ఒక సారి అడిగాను..

అతనికి నచ్చలేదు నేను అలా అడగడం...

"ఇప్పుడు అవసరమేముంది? డేడీ,చిన్న తాత చూసుకుంటున్నారు కదా! అవసరం వచ్చినప్పుడు చూస్తాను. అయినా నువ్వు ఎందుకు వర్రీ అవడం, కావాలంటే నీ ఉద్యోగం కూడా మానెయ్యి. " అన్నాడు తేలిగ్గా నవ్వుతూ..

" అంటే మునిగే సమయం వస్తే ఈదడం నేర్చుకుంటావా? అది సాధ్యమయ్యేపనేనా?" అన్నాను..

" నీ సమస్యమేమిటో నాకు తెలీదం లేదు మిషు" విసుక్కున్నాడు.

"అలా మా ఇద్దరి మధ్యా మాటపు పెరిగి గొడవయింది..

ఎందుకో తనకంటూ ఓ వ్యాపకం కానీ, వ్యాపారం కానీ లేని అతని చేతుల్లో, చెంతలో నా భవిషత్తు ప్రశ్నార్ధకంగా కనిపించింది కానీ ప్రశాంతత కనిపించలేదు..

దాంతో నేనే చెప్పాను అతనికి. " అంది నిట్టూర్స్తూ మిషెల్..

"అవునా? తర్వాత?"

" తర్వాత అంటే చాలానే జరిగింది, అవన్నీ నేను చెప్పడం తప్పు.. చెప్పి అతన్ని విలన్ చెయ్యడం నా ఉద్దేశ్యం కాదు. అందుకని చెద్దగా చెప్పలేను. ఎవరమైనా పరిస్తితులకనుగుణంగానే ప్రవర్తిస్తామని నేను బలంగా నమ్ముతాను. అతనికి తగనంత ఈగో ఉండవచ్చు, నేను అతన్ని కాదనుకున్నది కూడా ఆ అభిమానం గాయపడే కదా, ఒకరకంగా అది నా ఈగోనే.. అందుకే అతనికి ప్రశాంతంగానే అయినా స్థిరంగా చెప్పాను.. "

అంతకుముందే వాళ్ళ అమ్మగారికి కూడా..

ఆవిడ చాలా బాధ పడ్డారు కానీ ఏమీ అనలేకపోయారు..

'ఈ దేశంలో పిల్లల నిర్ణయాన్ని ప్రశ్నించలేమని నాకు తెలుసు మిషెల్.. నీలాంటి అమ్మాయి మా ఇంట్లోకి వస్తే బావుంటుందనుకున్నాను కానీ నీ నిర్ణయాన్ని మార్చుకోమనే హక్కు నాకు లేదు కదా! ఇది మా బేడ్ లక్ అనుకుంటాను.. ఐ విష్ యూ బెస్ట్' అన్నారు..

అలా సురేన్ వెళ్ళిపోయాడు..

నా గుర్తుగా లెహెంగా, ముత్యాల గొలుసు నీ దగ్గరే ఉంచుకో మన్న ఆవిడ కోరిక వల్ల అవి మాత్రం నా దగ్గరే ఉండిపోయాయి..

విడిపోవాలనుకోవడం తేలికే.. విడిపోవడం కాదు.. తెలిసింది కదా, నేను చెప్పేది..

నాకు కెవిన్, అదే నాభర్త పరిచయం అయ్యేవరకూ సురేన్, అతనికి సంబంధించిన ప్రతీ విషయం గుర్తొచ్చి నన్నెంతో బాధించేవి..

కెవిన్ నన్నెంతో ప్రేమగా చూసుకుంటూ సేద తీర్చేవాడు..

'మన మనసుకి దగ్గరగా వచ్చిన ఏ విషయాన్నైనా, మనిషినైనా వెంటనే మర్చిపోవక్కరలేదు.. అది నిజానికి సాధ్యం కాదు. ఇదేమైనా కంప్యూటర్ మెమరీ కాదు కదా బటన్ నొక్కగానే డిలీట్ అవడానికి? అవి మనకు గుర్తున్నంతవరకూ మన నిర్ణయం వెనక ఉన్న కారణాలని కూడా గుర్తు చేస్తాయి. అప్పుడు రెండూ అదే మనసూ, మెదడూ రెండూ బేలన్స్ అవుతాయి' ఇలా అతను చెప్పే మాటలు నాకెంతో సాంత్వన నిచ్చేవి..

అలా కెవిన్ తో నా జీవితం ఎంతో సంతోషం గా గడుస్తోంది, నాకేమీ కంప్లయింట్స్ లేవు" అంది మిషెల్..

" మరి ఈ రోజు ఇవన్నీ గుర్తు రావడానికి కారణం? మీ అమ్మాయి ఆ లెహెంగా తీసి వేసుకుంటాననడమా " అన్నాను ఆసక్తిగా..

" అవుననలేను.. ఎందుకంటే నిజం అది కాదు కనక..

" ఫేమిలీ వ్యాపారాన్ని మెస్ చేసిన వారసుడు అన్న వార్త లోకల్ పేపర్ లో సురేన్ ని ప్రస్తావిస్తూ రావడం, అప్పుల్లో కూరుకుపోయిన వాళ్ళ బిజినెస్ అని తెలియడం.. ఒకప్పటి నా స్నేహితుడి మీద, అతని కుటుంబం మీదా నాకున్న అభిమానం వల్ల నా మనసు బాధపడడం" అంది తన ఫోన్ లో ఆ న్యూస్ ఐటెం ని నాకు చూపిస్తూ...

" ఐ విష్ హిం వెల్.. నాకెంతో ప్రేమగా పచ్చ లెహెంగా ఇచ్చిన కుటుంబం ఎప్పుడు పచ్చగా ఉండాలి..." అందినెమ్మదిగా.. టిష్యూ పేపర్ తో కనుకొలకుల్లో నిలబడిన కన్నీటిచుక్కని తుడుచుకుంటూ .

●●●

Click here to share your comments on this story